"విశ్వ అట. . .మీ కోసం వచ్చాడమ్మా"

ఉలిక్కిపడింది కృషి . . .

అప్పుడు గుర్తుకొచ్చింది ఒప్పందం అమలు చేయడనికి విశ్వ రాత్రి పదిగంటలకి వస్తానన్న విషయం. . .

ఆమె ఫాలభాగం స్వేదం పేరుకుంటుంటే లేచి నిలబడింది. . .

"మన ఒప్పందం ప్రకారం వెళ్ళాల్సింది మీ బెడ్ రూంలోకి" కృషి వెనుకే ఆమె పర్సనల్ చాంబర్‌లోకి నడుస్తున్న విశ్వ అన్నాడు ద్వారం దగ్గర నిలబడి.

"మిస్టర్ విశ్వనాథ్" జుగుప్సగా చూసింది. రోషం, ఉద్వేగం, క్రోధం చుట్టు ముడుతుంటే "నేనెవర్ననుకుంటున్నావ్" సాధికారంగా ప్రశ్నించింది.

ఎగతాళిగా నవ్వాడు. అతడి చూపుల్లో వ్య క్తమవుతున్నది కాంక్షో లేక కారణం లేని ప్రతీకారమో ఆమెకీ అర్థం కావడం లేదు.

"నువ్వో విశ్వ సౌందర్యాన్ని సవాల్ చేసే పాల పుంతవైన సింధూరాంబరం నుంచి రసాతలం దాకా విస్తరించిన ప్రకృతిలా ఏ భంగిమలో నైనా చూడదగ్గ పొంకం గల గంధర్వ కన్య వైనా యిప్పుడు నాకు లొంగిపోవాల్సినదానివి. . . ఒక రాత్రి సుఖం కోసం నీ కన్యత్వాన్ని అర్పించాల్సిన దానివి. . . అవునా."

అది ఆందోళన కాదు. భగ్గుమంటున్న మస్తిష్కంలో బాధాకరంగా రేగుతున్న ఆరాటం. నౌకర్లని పిలిచి అతడ్ని బయటికి సాగనంపే ప్రయత్నానికింకా తను సిద్ధపడలేకపోతూాందేం. . . ఒప్పందంగా నోరు జారిన పాపానికే ఇదంతా తాను భరిస్తూాందా. . .

"కామాంచ యౌవనే. . ." రెండడుగులు ముందుకు నడిచి ఆమె కటి భాగాన్నో లేక నైటీ వెనుక వివృత దిగంత ద్వారాల్నో నవలోక ప్రాకారాల్నో ఊహించుకుంటూ స్వప్నంలోలా అన్నాడు "యవ్వనంలో వున్నప్పుడే విద్యతోబాటు కామాన్నీ సేవించి తీరాలంటాడు వాత్స్యాయనుడు. . . పైగా తామరమొగ్గలా సుతిమెత్తగా వుండేది- పువ్వులాంటి నాసిక గలది-సంపంగి కలువల శరీరఛాయతో శోభిల్లుతూ కాదంటూనే ప్రియుడ్ని రా రమ్మనేది పద్మినీ జాతి స్త్రీ అని నీలాంటి అమ్మాయి గురించి అద్భుతంగా నిర్వచించేడు కూడా."

లిప్తలు గడ్డ కట్టుకుపోతుంటే ఉద్రేకాన్ని నిభాయించుకోటానికి ఆమె విశ్వప్రయత్నం చేస్తూాంది.

"తనూలత" మరింత ముందుకొచ్చాడు.

"లతవంటి తనువు గలది అని కదూ. . .ఉపమానోత్తర పదకర్మధారయం. సమాసం కరెక్టో కాదో నాకు తెలీదు. కాని ఒకనాడు యీ పదానికి అర్థం తెలీకపోయినా నిన్ను చూస్తే నిజమనిపించింది కృషీ. . . కమాన్. ఇంకా ఆలస్యం దేనికి"

పిండుకోవాల్సిన ఉషస్సు గురించి గుర్తు చేస్తున్నాడు.

ఒక కార్యసాధన కోసం ఆ రోజు అంత గాయపడీ గాయాన్ని గోప్యంగా వుంచి చివరిదాకా పోరాడిన విశ్వని గుర్తుచేసుకుంటూ అంది. “నిజమే - ఒకనాడు అసంకల్పితంగా నువ్వన్న ఒప్పందానికిని నేను అంగీకరించాను - ఏ దురదృష్టకరమయిన క్షణంలో నేను సరేనన్నానో కాని యిప్పుడు నేను అన్లేదని బుకాయించను - జ్ఞానం తెలిసాక ఏ మగాడికీ అలాంటి అవకాశం కాదు- అలా మాట్లాడే అవకాశమే యివ్వని నేను నీ విషయంలో ఎవరో మంత్రించినట్టు మూగదాన్నయినా ఓ సభ్యతగల మగాడిగా నువ్వు రియాక్టవుతావనుకున్నాను. నోరు జారేక యిలా ఆలోచించడం నేరమే అని నాకూ తెలుసు. కాని నీ గెలుపు మనసారా కోరుకున్న నేను నువ్వు గెలిచావని నిరూపించేదాకా అవిశ్రాంతంగా పోరాడాను. ఆ తర్వాతనైనా నీ అభిమానానికి పాత్రురాలినవుతానని ఎదురు చూశాను.”

“నన్ను గెలిపించింది రాజేష్‌తో నువ్వు ఓడిపోకూడదని. . .కాని నన్ను పోటీకే రాకుండా ఆపాలని ప్రయత్నించింది నీ మీద నేను గెలవకూడదని.”

“నో” ఆవేశంగా అరిచింది “నిన్ను ఆపాలని గూండాల్ని ప్రయోగించింది నేను కాదు. నువ్వు పొరపడుతున్నావ్”

“నీకు కాక మరెవరికి అంత అవసరం వుంటుంది”

“తన కొడుకు ఓడిపోకూడదని చౌదరియే ఆ పని చేయించి వుండొచ్చుగా”

“నేను గెలిస్తే ఎక్కువగా నష్టపోయేది నువ్వు కృషీ.” అర్థం చేసుకోడేం-

నిర్లక్ష్యంగా అన్నాడు “నిజానికి నేను కావాలీ అనుకుంటే పోలీసులకి చిక్కిన క్రిమినల్ చేత దోషులెవరో చెప్పించడం కష్టం కాదు కృషి- కాని అక్కడా నీ డబ్బు నన్ను ఓడిస్తుందేమో అన్న అనుమానంతో నీకు తిరుగులేని బుద్ధి చెప్పాలని మన ఒప్పందం అమలుచేయడానికి ఇలా వచ్చాను.”

నిర్లిప్తంగా చూసింది. అంతకుమించి అర్థం లేని అతడి తర్కానికి జాలి పడింది. “ఓ మగాడిగా నా మీద గెలుపు కోసం మాత్రమే ఆలోచించే నిన్ను చూసి ఆ రోజు గెలిపించడానికి నేను పడ్డ శ్రమకిప్పుడు బాధపడుతున్నాను విశ్వనాథ్. డబ్బున్న వాళ్ళ గురించి నీకింత నీచమయిన అభిప్రాయం ఎందుకేర్పడినా గాని యీ క్షణంలో నేను చెప్పాలనుకున్నది ఒక్కటే - నువ్వు కోరుకుంటున్నది క్షణికానందం - డబ్బుకోసం ఏదన్నా చేయగల మనిషిగా నాకు పరిచయమయిన నువ్వు యిప్పుడు డబ్బు కన్నా యీ సుఖాన్నే ఎందుకిష్టపడుతున్నావో నాకు తోచడం లేదు - నిజం విశ్వనాథ్ - దానికి బదులు పది లక్షలు చెల్లించమంటే నీ వ్యక్తిత్వాన్ని గౌరవించేదాన్ని. అసలు ఒక్కరాత్రి సుఖంతో నువ్వు పొందే ఆనందం కండరాల రాపిడేగా- నైతిక విలువల్ని నీలాగే మరిచిపోతే అది నాకూ పెద్ద విషయం కాదుగా . . . వందరూపాయలు పారేస్తే ఏ వేశ్య దగ్గరయినా దొరికేదేగా. . . అందులోనూ ఉన్నింటి ఆడపిల్ల మీద యిలాంటి విజయాన్ని కోరుకోవడమే నీ ధ్యేయమైతే.”

.ఇంకా మానని గాయాల ప్రేరణతో ఆమె మీద కసి తీర్చుకోవడం.

"చాలా చెప్పి శ్రమ పడ్డావ్ కృషి. . . ఇక చాలు . . . నీ మాటల చాతుర్యాన్ని నీ మేధస్సుని ప్రదర్శించక మన ఒప్పందం సంగతి మాట్లాడు."

తను అనాలోచితంగా ఇంతకాలం వెంటపడింది సముద్రాన్ని కాదు ఓ మామూలు నీటి చలమనని బోధపడిందామెకు.

"అంగీకరించకపోతే" భావరహితంగా చూసింది కృషి "నీ దగ్గరున్న టేప్‌ని పత్రికల దాకా వినిపిస్తానంటావ్."

"గుడ్. . . గుర్తుందిగా."

"కాని ఆ చిన్న సాక్ష్యంతో నన్ను నువ్వు బెదిరించలేవని నువ్వు గుర్తుంచుకోవడం బెటర్ విశ్వనాథ్"

"అంటే మాట తప్పటానికి సిద్ధపడతానంటావ్"

క్షణం పాటు నిర్లిప్తంగా చూసింది. "మన మధ్య ఒప్పందమేమిటి" ఖచ్చితంగా చెప్పగలవా"

ప్రశ్నలో ఔచిత్యం అర్థంకాక నివ్వెరపోయాడు విశ్శు. "నేను ఓడితే మీ ఇంట్లో వాచ్‌మెన్‌గా పనిచేయాలి. కాని నువ్వు ఓడితే ఓ రాత్రి నువ్వు నాతో గడపాలి."

"అంతేగా"

"యస్"

"గడుపుతాను ఇప్పుడు కాదు."

"ఎప్పుడు"

"నాకు తోచినప్పుడు" నిర్లక్ష్యంగా అంది కృషి.

"అంతే విశ్శు. . .గడపాల్సింది ఎప్పుడో ఏ రాత్రో ఖచ్చితంగా మనం అనుకోలేదుగా"

తెల్లబోయాడు విశ్శు.

ఆమె మీద పెంచుకున్న కసితో ప్రతీకారం తీసుకోవాలని వచ్చిన విశ్శు ఇప్పుడు ఈ తర్కానికి వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. "తెలివితేటలు ప్రదర్శించకు కృషి"

"ఇట్స్ మై మైండ్ పవర్ మిస్టర్ విశ్శు. . .ఏం. . . నేను అన్నదాంట్లో తప్పుందా. అసలు నేను కాదంటేగా."

"నీ ఇష్టమొచ్చినప్పుడు గడుపుతాననడం కాదనడమేగా."

"అది కాదనడం కాదు విశ్శూ. . . అవునంటూనే నిన్ను నీరు కార్పించడం... యస్ నేను నీతో గడుపుతాను. ఎప్పుడో తెలుసా. నాకు ఎనభై యేళ్ళు వయసొచ్చాక ప్రామిస్"

ఆవేశంగా ముందుకు రాబోయాడు

"ఆగు మిస్టర్ విశ్శూ - హద్దులు మరిచి ప్రవర్తిస్తే నా స్థాయి ఏమిటీ అన్నది నేను ఖచ్చితంగా నిరూపించాల్సి వస్తుంది."

విశ్వ పిడికిళ్ళు బిగుసుకున్నాయి "తెలివిగా తప్పించుకున్నావ్ కృషి"

"యస్.. . నాకు డబ్బు మాత్రమే కాదు తెలివీ వుందని నువ్వు గ్రహించితే బెటరు."

"నీ డబ్బునీ తెలివినీ కలిపి మరీ ఓడించగలిగే తెలివి నా దగ్గరావుంది కృషి - ఆ విషయం నీకు త్వరలోనే తెలియచెబుతాను"

"నువ్వు ఓడించడానికి నేను మామూలు జికెబుక్ చదివి పోటీకి సిద్ధపడే రాజేష్‌ని కాను."

"అలాగా" వ్యంగ్యంగా అన్నాడు.

"ఏం. . అనుమానమా"

"నిరూపించుకోగలవా"

రెప్పలార్పకుండా చూసింది "నిన్ను నువ్వు చాలా ఎక్కువగా అంచనా వేసుకుంటున్నావ్ కదూ"

"కబుర్లు చెప్పడం కాదు కృషి " నిశ్చలంగా అన్నాడు. "దమ్ముంటే వేదిక మీద నా ముందు నిలబడి పోటీకి సిద్ధంకా"

"నేను చాలా ఖరీదైన ఆడపిల్లని"

"ఖరీదు నిర్ణయించేది కాల్‌గర్ల్స్."

కృషి కోపం తెచ్చుకోలేదు. "నా గురించి నువ్వలా నీచంగా ఆలోచించినా నాకు అభ్యంతరం లేదు. మిస్టర్ విశ్వనాథ్ కాల్‌గర్ల్స్‌క్కూడా వేర్వేరు స్థాయిలు వుంటాయనుకుంటా కదూ కాబట్టే ఇప్పుడు పందేనికి ఎన్ని లక్షలు పెట్టుబడి పెడతావని అడుగుతున్నాను."

"నేను గెలిస్తే నీ నుంచి కోరేది డబ్బుకాదు."

"మరి"

"నీతో ఓ రాత్రి సుఖం. స్పష్టంగా విను.. . నేను ఏ రాత్రికావాలీ అంటే ఆ రాత్రి నువ్వు నాతో గడపాలి. గడపడమూ అంటే తోడు వుండడమేగా అంటూ లాజిక్ ప్రదర్శించకు - గడపడమూ అంటే నాతో సెక్స్ సుఖానికి అంగీకరించడం"

కృషి మొహం జేవురించిపోయింది.

"ఏం కంగారుగా వుందా"

"లేదు విశ్వ - చాలా ఖరీదైన కోర్కెకి సిద్ధపడ్డావు. కాబట్టి నేను నీతో క్విజ్ కాంపిటేషన్‌లో ఓడితే నువ్వడిగిన దానికి సరేనంటున్నాను. మరి నువ్వోడితే ఏం చెల్లిస్తావు అని అడుగుతున్నాను"

"వాచ్‌మెన్‌గా వుండమన్నావుగా"

"కేరెక్టర్ లేనివాడు వాచ్‌మెన్‌గా వుండటానికిని నేనిష్టపడను విశ్వా. . ." క్షణం ఆగి అంది. "నువ్వోడితే నాకు అయిదు లక్షలివ్వాలి."

ఉలిక్కిపడ్డాడు.

"ఏం.. కంగారుగా వుందా" అతడను మాట అతడికే అప్పచెప్పింది. "నా డబ్బు మీద

నా తెలివి మీదనే గాక నా శరీరం మీద కూడా గెలుపు కోరుకుంటున్నావుగా. చెప్పు. అయిదు లక్షలు పెట్టుబడి పెట్టగలవా. కష్టమనుకుంటా కదూ. మోసం చేసి వందా వెయ్యీ సంపాదించే నీకు అంత డబ్బు కూర్చుకోవడం!"

"మిస్ కృషి" అహం దెబ్బతిన్నట్టుగా చూశాడు "మైండ్ పవర్ - అదే మేధస్సు నీ ఒక్కదాని సొత్తే కాదుగా - నీ షరతులకి నేను అంగీకరిస్తున్నాను"

"మరోసారి ఆలోచించు"

"ఆలోచించాల్సిన అగత్యం లేదు."

"అయితే ఈ నెల పదిహేనో తేదీన అంటే సరిగ్గా పది రోజుల్లో మనం కాంపిటీషన్‌కి సిద్ధ పడుతున్నాం. ఓ.కె."

"సరే"

"తర్వాత యిస్తాననడం కాదు. పోటీకి ముందే అయిదు లక్షల చెక్కు క్విజ్ మాస్టర్‌కి ఇవ్వాలి" స్పష్టం చేసింది.

వెళ్ళిపోయాడు విశ్వ-

అప్పటికి సమస్య నుంచి తెలివిగా గట్టెక్కడమే గాక ఇక ముందు సైతం తనతో పోరాటానికి సిద్ధపడకుండా జాగ్రత్తపడ్డాననుకున్న కృషి పొరపాటు పడిందిక్కడే. . .

విశ్వ సరాసరి రామనాథ చౌదరి దగ్గరికి వెళ్ళాడు.

ఓ శత్రువుకి శత్రువు స్నేహితుడవుతాడన్న తర్కాన్ని నమ్మిన విశ్వని నిరుత్సాహపరచలేదు చౌదరి-

ప్రతిష్ట పరపతి అనే జోడు గుర్రాలపై స్వారీ చేసే ఉపాధ్యాయకి ఒక్కగానొక్క వారసురాలైన కృషిని శరీరం పెట్టుబడి పెట్టమనడం స్థాయికి దిగజార్చగలిగిన విశ్వ అటే చాలా గౌరవం ఏర్పడింది.

"నా సంగతి అటుంచి" అయిదు లక్షల్ని పెట్టుబడిగా అడిగిన విశ్వ గురించి మరింత తెలుసుకోవాలన్నట్టుగా అడిగాడు చౌదరి "నీకు కృషి మీద ఇంట్రస్టేమిటి"

ఉలిక్కిపడ్డాడు విశ్వ.

కేవలం తనకే పరిమితం కావాల్సిన ఓ నిజాన్ని ఇంతకాలం తర్వాత చౌదరి తెలుసుకోవాలనుకుంటున్నాడు "ఇంట్రస్టు కాదు చౌదరిగారూ - పగ. . ."

దిగ్భ్రాంతిగా చూశాడు చౌదరి కొత్త విషయం వింటున్నాట్టుగా.

"అవును. . . నేను కృషితో పరిచయం పెట్టుకున్నది నా పగ సాధించడనికే చౌదరిగారూ.... చనిపోయిన నా తండ్రి, పిచ్చిదైన నా తల్లి నాకు ప్రేరణ అందిస్తుంటే చదువుతున్న చదువుని మధ్యలో ఆపి వెనక్కి వచ్చేశాను. నా కుటుంబం ఇలా చిన్నాభిన్నం కావటానికి ఉపాధ్యాయ కారణమని తెలిసి తెలివిగా ఆ కుటుంబంలో అడుగుపెట్టాలని మరో మార్గంలేక కృషితో వితండా పరిచయాన్ని ప్రారంభించాను"

"ఎంతవరకూ చదివావు"

"పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పిహెచ్ డి చేస్తూ మధ్యలో ఆపేశాను."

ఆ మాట వింటూనే చౌదరికి చెమట పట్టింది. తనముందు నిలబడ్డ వ్యక్తి సామాన్యుడు కాదని తెలిసిన తొలి క్షణమది. . .పోరాటానికి ఆయుధాలు, వాటిని సమకూర్చుకోవటానికి డబ్బు అవసరమనిపించి ఈ మార్గంలో అడుగు పెట్టాడు కాని విశ్వ సామాన్యుడు కాడు . . . ఉపాధ్యాయ కుటుంబంలో అడుగుపెట్టి ఆ కుటుంబాన్ని సర్వనాశనం చేయగల సమర్థుడు. అది సాధ్యం కాకపోతే ఏ ఐ.ఏ.యస్సో పాసై కలెక్టరు కాదగ్గవాడు. తనకి కలెక్టర్లు సాహచర్యం అవసరం లేదు. తెలివైన నేరస్తుడు కావాలి.

"నీ కుటుంబం చిన్నాభిన్నం కావడమంటే" అడిగాడు చౌదరి.

"ఉపాద్యాయ ఫ్యాక్టరీలో యూనియన్ లీడర్‌గా వుంటూ హత్య చేయబడ్డాడు నా తండ్రి".